ఆస్తిపన్ను లక్ష్యం చేరేనా..!

- ఆస్తి పన్ను వసూలుకు ఇంకా మూడు రోజులే..
- 80 మందికి రెడ్ నోటీసులు జారీ
- సెలవు రోజుల్లో కూడా అందుబాటులో అధికారులు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ, మార్చి 28: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను టార్గెట్‌ను చేరుకోవడం కష్టమే కనిపిస్తుంది. కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లకు అధికారులు అనేక చర్యలు చేపట్టినా ఫలితం అంతంత మాత్రమే కనిపిస్తుంది. ఆస్తిపన్ను చెల్లింపు ఇంకా మూడు రోజులే ఉండడంతో వారు టార్గెట్‌ను చేరుకోవడం ఇబ్బందిగా మారింది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం ఆస్తి పన్ను చెల్లింపుదారులు 35,982 మంది ఉండగా అందులో 22,947 మంది ఆస్తి పన్నును చెల్లించినట్లు అధికారులు తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ మొత్తం రూ. 33 కోట్ల 80 లక్షలు ఉండగా నేటికీ కలెక్షన్ రూ.19 కోట్లు వసూలైనట్లు అధికారులు తెలిపారు. దీంతో 60, శాతం ఆస్తిపన్ను వసూలైంది. గత ఏడాది ఆస్తి పన్ను మొత్తం 73% వసూలు కాగా ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతుండడంతో గత ఏడాది ఆస్తి పన్ను వసూలు శాతం చేరుకోవడం కూడా కష్టంగా కనిపిస్తున్నది.

సెలవు రోజుల్లోను అందుబాటులో అధికారులు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను దారులకు ఆస్తి పన్నుపై అనేక అవగాహన కార్యక్రమాలను చేపట్టినట్లు కమిషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. 10 శాతం వడ్డీతో ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ఉపయోగించుకొని తమ ఆస్తి పన్ను చెల్లించాలని ఆయన కోరారు. ఉగాది, రంజాన్ పండుగల సెలవు రోజుల్లో కూడా తమ కార్యాలయం తెరిచి ఉంటుందని ఆస్తిపన్ను దారులు తమ ఆస్తిపన్ను చెల్లించాలన్నారు.

– శరత్‌చంద్ర, బండ్లగూడ జాగీర్ కమిషనర్

80 మందికి రెడ్ నోటీసులు జారీ

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను వసూలు కోసం అధికారులు మొండి బకాయిదారులు 80 మందికి రెడ్ నోటీసులను జారీ చేసినట్లు తెలిపారు.

ఆస్తిపన్నులు పెరగడంతో..చెల్లింపుల్లో ఇబ్బందులు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తి పన్నుదారులు గతంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేవి. కాగా ఐదేళ్లుగా గ్రామ పంచాయతీల నుంచి మున్సిపల్ కార్పొరేషన్ గా ఏర్పడడంతో ఆస్తి పనుల విలువలు చాలా పెరిగాయి. దీంతో ఆస్తిపన్ను దారులు తమ ఆస్తి పన్నును చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు సిబ్బంది వాపోతున్నారు.

టీబీపై అవగాహన పెంచుకోవాలి

టీబీ నిర్మూలనపై అవగాహన కోసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 28: క్షయ వ్యాధి(టీబీ)పై ప్రజలు అవగాహన పెంచుకొని ఆరోగ్యంగా ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. వరల్డ్ టీబీ డేను పురస్కరించుకొని శుక్రవారం టీబీ నిర్మూలనపై అవగాహన పెంచే ఐఈసీ ప్రచార కరపత్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. క్షయ వ్యాధి పూర్తిగా నయం చేయగలిగే వ్యాధి కానీ సరైన అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం కారణంగా ఇది ఇంకా సమస్యగా మారిందన్నారు. ప్రజలందరూ దీనిపై అప్రమత్తంగా ఉండి, లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ రహీం మాట్లాడుతూ టీబీ నిర్మూలనలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా మైక్రోస్కోపీ పరీక్షలు, ఎక్స్ రే స్కానింగ్, రక్త పరీక్షలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ అలర్ట్ ఇండియా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కిరణ్, నరేష్‌కుమార్, హెల్త్ ప్రొఫెషనల్ మధుబాబు, ఆశ కార్యకర్త పద్మలత తదితరులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువవికాస్'కు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్, మార్చి 28: రాష్ట్రం ప్రభుత్వం రాజీవ్ యువవికాస్ పథకం కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో మున్ని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసుల వారు ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు చేసుకొనే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 28: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు దుర్గానగర్, దుర్గా హిల్స్, టీఎన్‌జీవోస్ కాలనీ, అయ్యప్ప స్వామి టెంపుల్, మైలార్‌దేవ్‌పల్లి కల్లు కాంపౌండ్, శాంతినగర్, గణేష్‌నగర్ స్వప్న థియేటర్ ప్రాంతం తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

హిమాయత్ నగర్ , మార్చి 28: తరగతి గదిలో నేర్చుకున్న చదువు సమాజానికి దోహద పడినప్పుడే ఆ చదువుకు సార్థకత ఉంటుందని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆర్ట్స్ క్లబ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ ప్రపంచాన్ని తట్టుకుని నిలవాలంటే మక్కువతో చదివి సరైన లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. ప్రతి విద్యార్థి ఆయా రంగాల్లో తమ నైపు ణ్యాలను చాటి అంది వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పాటలు పాడటం , డైలాగ్‌లు ,మిమిక్రీ చేసి అందరిని అలరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జె.నాగరత్నం, డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ గడ్డం ఆదాము, డాక్టర్ బి.భిక్షపతి, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ గోవింద్ దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ ఉద్యోగులు

2న చలో ఢిల్లీ

వ్యవసాయ యూనివర్సిటీ ,మార్చి 28:బీసీలకు 42 శాతం విద్య ,ఉద్యోగ ,రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ కల్పిస్తామని ,తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడం జరిగింది. ఈ బిల్లుపై పార్లమెంట్లో చట్టం చేస్తూ బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తలపెట్టిన, హలో బీసీ-చలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఏర్పాటు చేసిన మహాధర్నా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ బీసీ ఉద్యోగులు మద్దతు తెలుపుతూ.గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ ,ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమా మేడం, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధ్యక్షులు భిక్షపతి తదితరులు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ల రిజర్వేషన్ కల్పించాలని , క్రీమిలేయర్ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాలని ,ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేయాలని, బీసీ ఉద్యోగులకు రక్షణ చట్టం తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, దశరథ్ ,రమేష్ ,కృష్ణ ,సంతోష్ గౌడ్ ,కవిత, సురేఖ ,సందీప్ ,రజినీకాంత్ , తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం

శంషాబాద్ రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి

తొండుపల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభించి పరిశీలిస్తున్న సీఐ నరేందర్‌రెడ్డి, తదితరులు

శంషాబాద్ రూరల్ , మార్చి 28 : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకమని శంషాబాద్ రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని తొండుపల్లి గ్రామంలో స్థానికుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకమన్నారు. ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమన్నారు. తొండుపల్లి గ్రామం జాతీయ రహదారికి ఇరువైపులా ఉండడంతో నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు నిర్వహిస్తుంటాయి. దీంతో పాటురోడ్డు ప్రమాదాలు జరిగినా.. దోపిడీలు జరిగినా వారిని గుర్తించడం కొంతకష్టంగా ఉండేదన్నారు. కాని సీసీ కెమెరాల ఏర్పాటుతో నిందితులను త్వరలో పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు కొండ పరమేష్‌గౌడ్,సుధాకర్‌గౌడ్, దొడ్డ పెంటయ్య, అశోక్‌గౌడ్,సునీల్‌గౌడ్, శేఖర్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్,సిద్ధులు, నర్సింగ్, దామోదర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి రైతులు సహకరించాలి

మల్కారం సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీష్

మల్కారం సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ బుర్కుంట సతీష్, తదితరులు

శంషాబాద్ రూరల్, మార్చి 28 : సహకార సంఘం అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని మల్కారం సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీష్ సూచించారు. శుక్రవారం మండలంలోని మల్కారం సహకార సంఘం సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సతీష్ మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సంఘంలో ప్రస్తుతం రూ. 16 కోట్ల టర్నోవర్ జరుగుతుందని వివరించారు. రైతులు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు తీసుకొని తిరిగి చెల్లించి మరోసారి రుణం తీసుకోవడం కోసం అర్హత పొందాలన్నారు. రైతు ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పరిసర ప్రాంతాల ప్రజలకు అనుగుణంగా రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకుంటున్నట్లు చెప్పారు. రైతుల రుణాలతో పాటు బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సంఘంలోని రైతులకు పంట రుణాలు రూ. 98లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.4 కోట్లు మంజూరు చేశామని వివరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మేకల ప్రభుసాగర్,డైరక్టర్లు రవికాంత్‌రెడ్డి,లక్ష్మీకృష్ణారెడ్డి, శంకరయ్య, కాసుల బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

30 నుంచి జిమ్నాస్టిక్స్ లో ఉచిత శిక్షణ

జూబ్లీహిల్స్, మార్చి 28: విష్ణునగర్ జిమ్నాస్టిక్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జిమ్నాస్టిక్స్ లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఇనిస్టిట్యూట్ ప్రధాన కార్యదర్శి బి. బాల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని కేవీబీఆర్ స్టేడియం ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. సమ్మర్ కోచింగ్‌లో భాగంగా నగరంలోని మాసబ్‌ట్యాంక్ మహవీర్ హాస్పిటల్ ప్రాంతంలోని సీఐబీ క్వార్టర్స్‌లోని ఇనిస్టిట్యూట్ లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేటి నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 96182 99365 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

చారుసిన్హాకు .. వీడ్కోలు

ఏడేళ్ల పాటు డిప్యుటేషన్ మీద సీఆర్‌పీఎఫ్‌లో ఐజీగా విధులు నిర్వహించి తెలంగాణ క్యాడర్ ఐపీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్న సీనియర్ ఐపీఎస్ అధికారిణి చారు సిన్హాకు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సదరన్ సెక్టార్ కేంద్ర కార్యాలయంలో సిబ్బంది, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. సీఆర్‌పీఎఫ్‌లో ఐజీగా ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లో బాధ్యతలు నిర్వహించిన చారు సిన్హాకు సిబ్బందితో పాటు కుటుంసభ్యులు వీడ్కోలు పలికారు. –బంజారాహిల్స్

దుంపలసాగు ఎంతో లాభదాయకం

వ్యవసాయ యూనివర్సిటీ,మార్చి 28: కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ కూరగాయల పరిశోధన స్థానం ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాలకు చెందిన ఎస్సీ రైతులకు దుంప పంటల సాగులో మెళకువల గురించి రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రైతు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హార్టికల్చర్ వీసీ డాక్టర్ డి రాజిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణలో దుంప పంటల సాగు ,ఆవశ్యకత గురించి మాట్లాడారు. పోషక ఆహార లోపాలు, ఆహార కొరతను అధిగమించడానికి దుంప పంటలు ఎంతగానో మేలు చేస్తాయని వివరించారు. కూరగాయల పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ చేమ, మొరంతీగ యాజమాన్య పద్ధతులు, వాటితో చేసే విలువ ఆధారిత ఉత్పత్తుల గురుంచి వివరించారు. వీటిని తక్కువ పెట్టుబడితో అధికంగా లాభాలు వచ్చే అవకాశాల గురించి తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ భగవాన్ రిజిస్ట్రా, డాక్టర్ టి సురేష్‌కుమార్ రెడ్డి ,జోనల్ హెడ్ డాక్టర్ డి అనిత కుమారి ,ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అండ్ హెడ్, కూరగాయల పరిశోధన స్థానం. కళాశాల అసోసియేయేట్ డాక్టర్ పి ప్రశాంత్ , డాక్టర్ ఆర్ ప్రీతం గౌడ్ సీనియర్ శాస్త్రవేత్త, డాక్టర్ వీర సురేష్ దుంప పంటల శాస్త్రవేత్త, కూరగాయల పరిశోధన స్థానం తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.

అనుమతులు లేని భవన నిర్మాణాన్ని ఆపాలి

ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన డీఎంసీ

బంజారాహిల్స్,మార్చి 28: వాల్మీకి ఆవాస్ యోజన పథకం కింద పేదలకు కేటాయించిన స్థలాలను అడ్డదారిలో కొనుగోలు చేయడంతో పాటు జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా చేపట్టిన భవన నిర్మాణాలు ఆపాలంటూ సర్కిల్-18 డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి ఫిలింనగర్ పోలీసులకు శుక్రవారం లేఖ రాశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ బస్తీలో హెచ్.వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి పేదల కోసం కేటాయించిన వాల్మీకి ఆవాస్ యోజన ఇండ్లను కొనుగోలు చేసి సుమారు 120 గజాల్లో అక్రమ నిర్మాణం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదులు చేశారు. దీంతో పాటు కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో స్పందించిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఇటీవల వెంకట్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయినా పట్టించుకోకపోవడంతో పాటు పనులు కొనసాగిస్తున్నాడు.

దీంతో ఎలాంటి అనుమతులు లేకుండా పనులు చేస్తున్న వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీఎంసీ ప్రశాంతి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 28: అతివేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడు ముందుగా వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం మన్ననూర్ ప్రాంతానికి చెందిన రాహుల్ రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయంలో పీజీ చదువుతున్నాడు. గురువారం రాత్రి పల్సర్ బైక్‌పై తన స్నేహితుడు మనోహర్‌తో కలిసి పని నిమిత్తం బయటకు వచ్చాడు. పని ముగించుకొని తిరిగి హాస్టల్‌కు వెళ్తున్న సమయంలో దుర్గానగర్ చౌరస్తా ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ లారీ ముందు నుంచి ఓవర్ టేక్ చేశాడు. ఈ సమయంలో లారీని ఢీకొని రాహుల్‌తో పాటు మనోహర్‌లు కిందపడ్డారు. వీరికి తీవ్ర గాయాలయ్యాయి. రాష్ డ్రైవింగ్ చేసి లారీని ఢీకొట్టాడని లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

ప్రభుత్వ భూములను కాపాడాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

శంషాబాద్ రూరల్, మార్చి 28 : ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలని సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో శంషాబాద్ రెవెన్యూ అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీలో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా.. రెవెన్యూ అధికారులు స్పందించడంలేదని వారు ఆరోపించారు. మున్సిపాలిటీలో కాముని చెరువుతో పాటు తొండుపల్లి చెరువు వద్ద ప్రభుత్వ భూములను కబ్జా చేశారని తెలిపారు.రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం మండల కన్వీనర్ కేవై ప్రణ్‌య్,నీరటి మల్లేష, సామేల్, కొత్తపల్లి మల్లేష్‌లతో పాటు పలువురు ఉన్నారు.

బ్యూటీషియన్‌కు వేధింపులు కేసు నమోదు

బంజారాహిల్స్,మార్చి 28: బ్యూటీషియన్‌తో పరిచయం పెంచుకుని వేధింపులకు గురిచేస్తున్న స్పా నిర్వాహకుడిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్న వివాహిత(35) మాదాపూర్‌లో బ్యూటీషియన్‌గా పనిచేస్తుంటుంది. ఆమెకు భర్తతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. కాగా ఏడాది క్రితం మల్కాజిగిరిలోని ఓ స్పాలో ఇంటర్వ్యూ కోసం వెళ్లిన బ్యూటీషియన్‌కు స్పా యజమాని విక్కీ విక్రమ్‌తో పరిచయం ఏర్పడింది. కాగా కొన్నిరోజులుగా ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండడంతో పాటు భర్తకు విషయం చెబుతా అంటూ బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనకు పెండ్లి అయి పిల్లలున్నారని, తన జోలికి రావద్దని చెప్పినా పట్టించుకోకుండా నేరుగా ఇంటికొచ్చి న్యూసెన్స్ చేస్తున్నాడు. అతడి వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీలింగ్ భూమిలో..ప్రహరీ గోడ పనులు నిలిపివేత

కాచారం గ్రామంలో సర్వే నంబర్ 71లో సీలింగ్ భూమిలో చేపడుతున్న ప్రహరీ నిర్మాణం

శంషాబాద్ రూరల్, మార్చి 28 : కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సీలింగ్ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి చుట్టు ప్రహరీగోడ నిర్మాణం పనులు చేపడుతున్నారు. మండలంలోని కాచారం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 71లో 3 ఎకరాల 4 గుంటల ప్రభుత్వ సీలింగ్ భూమి ఉంది. ఈ భూమి తమదేనని అదే గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు మా తాతల కాలం నుంచి మాదేనంటూ శుక్రవారం ఉదయం చుట్టు ప్రహరీగోడ నిర్మాణం పనులు చేపడుతున్నారు. గమనించిన స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేసినా వారిని భయపెడుతూ ఈ భూమి మా పూర్వీకుల నుంచి తమదేనని పేర్కొంటూ ఫ్రీకాస్ట్ రోడ్డ నిర్మాణం చేపడుతున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై రెవెన్యూశాఖ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ప్రహరీగోడ పనులు నిలిపివేత

మండలంలోని కాచారం గ్రామంలో సర్వే నంబర్ 71లో 3 ఎకరాల 4 గుంటల భూమి ఉంది. ప్రభుత్వ సీలింగ్ భూమి కావడంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు కాచారం గ్రామానికి చెరుకొని ప్రహరీగోడ పనులు నిలిపివేయించిన్నట్లు ఆర్ఐ సారిక తెలిపారు. మీవద్ద ఉన్న పత్రాలను చూపించాలని ఆదేశించగా రెండు రోజుల సమయం కావాలని కోరినట్లు వివరించారు.

ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం

మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారం ధూళిపాళ

రాఘవేంద్ర నగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, మార్చి 28 : మణికొండ బీఆర్ఎస్ పార్టీ 'గుడ్ మార్నింగ్ మణికొండ' పేరిట ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పుప్పాలగూడ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను బీఆర్ఎస్ పార్టీ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వారు మట్లాడుతూ.. రాఘవేంద్ర కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై బీఆర్ఎస్ పార్టీ ముందుండి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారం ధూళిపాళ, నాయకులు గుట్టమీది నరేందర్, గోరుకంటి విఠల్, సంగం శ్రీకాంత్, కిరణ్ యాలాల, మాల్యాద్రి నాయుడు, భాను చందర్, సుమనళిని, తిరుపతి, చెరుకూరి బాలాజీ పాల్గొన్నారు.

'చింతల్‌బస్తీ సొసైటీని రద్దు చేయాలి'

బంజారాహిల్స్,మార్చి 28: బోగస్ ఓటర్లతో జాబితా రూపొందించడంతో పాటు సహకారశాఖ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడి నిర్వహించిన చింతల్‌బస్తీ కల్లుగీత సహకార సొసైటీ పాలకమండలి ఎన్నికను రద్దు చేస్తూ సహకారశాఖ ట్రిబ్యునల్ తీర్పును వెల్లడించి మూడు నెలలు పూర్తయినా హైదరాబాద్ జిల్లా ఆబ్కారీ శాఖ అధికారులు తీర్పును అమలు చేయడం లేదని చింతల్‌బస్తీ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పి.వేణుగోపాల్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ.. చింతల్‌బస్తీ కల్లుగీత సహకార సొసైటీకి చెందిన నిజమైన గీత కార్మికుల ఓట్లను గల్లంతు చేసి బోగస్ ఓట్లతో 2022 జూన్ 6న నిర్వహించిన ఎన్నికలో జరిగిన అవకతవకలపై తాను సహకారశాఖ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించానన్నారు. దీంతో మూడునెలల క్రితం చీఫ్ ప్రమోటర్‌గా కే.సుగుణమ్మతో పాటు ఇతర పాలకమండలి ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. కాని సంబంధిత అధికారులు దానిని అమలు చేయడంలో తాత్సరం చేస్తున్నారని త్వరలో మరోసారి కోర్టు దిక్కరణ కేసు నమోదు చేయిస్తామన్నారు. నిజమైన కల్లుగీత కార్మికులకు న్యాయం చేసేదాకా ఊరుకునేది లేదని పేర్కొన్నారు.

సాంస్కృతికశాఖతోనే మహనీయుల జయంతి ఉత్సవాలనునిర్వహించాలి

హిమాయత్ నగర్ , మార్చి 28: మహనీయుల జయంతి ఉత్సవాలను తెలంగాణ సాంస్కృతిక శాఖతోనే నిర్వహించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పెట్టుబడి తిరిగి ఇవ్వాలన్నందుకు దాడి

బంజారాహిల్స్,మార్చి 28: వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తీసుకొస్తున్నాడన్న కోపంతో వ్యక్తిపై రాడ్‌తో దాడి చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ఖలీల్ అహ్మద్ అనే వ్యక్తి ఇటీవల నగరానికి వచ్చి లంగర్ హౌస్ ప్రాంతంలో నివ